# కైకిలి

– కొలువ మల్లయ్య



"రాజన్నా! ఓ రాజన్నా!" పిలిచింది వీరమ్మ. తల్లి పిలుపు విని పుస్తకంలోంచి తల పైకెత్తాడు రాజయ్య. "ఏందే అవ్వా...! ఏం గావాలి...?" అన్నాడు. "పొల్లగాడు మంచిగస దువుకుంటాంటే నీ ఒర్రుడేంది..? ఎందుకు పిలుత్తున్నవాన్ని..? చదువుకోనియ్యలేవు.." అన్నాడు వాకిట్లో కూర్చొని చుట్ట కాలుస్తున్న నర్సయ్య.... "రాజన్నకు పనిజెపుతే నీకేం గావట్టె. చేసిండు కూసున్నడు.. మందనడు... మాకనడన్నట్టు నీ లెక్క గూసుంటే ఐపో తదా..? ఆనికి పనిజెప్పుతె ఈనకేనాయె..."

భర్తను దులిపిడిసిపెట్టింది వీరమ్మ.

నర్సయ్యేం మాట్లాడ కుండా కూర్చున్నాడు...

"అవ్వా..! నేను చదువుకుంటున్న గాదె... చదువుకునెటప్పుడు నడిమికి రావద్దని అన్నడు నాయన..."

"ఆరో తరగతి సదువు కుంట పెద్దచదువు చదివినట్టు చెయ్యవట్టివేంది బిడ్డ..! మీ నాయన్నకేంది గట్లనే అంటడు. చుట్ట దాక్కుంట ఎట్ల కూసున్నడో చూడు..."

"ఎప్పటికి నీకు నా మీదనే కన్నే.. ఇప్పటిదాక పనికి పోయి వచ్చిన్నా..? ఎడ్లనుకొట్టంల కట్టేసి మాతేసి ఇప్పుడే వచ్చిన్నా...! అట్ల కూసున్నందుకు నన్నాడిపోసుకోవట్టివి...."

"ఆ.. నిన్ను నేనాడిపోసుకున్న తియ్యి. మరి రాజన్నకు పని జెప్పుతుంటే నడిమికి రావట్టివి..."

"పో నీయవ్వ.. నీకు సదువు సంగతీ విలువే తెలువది.. నేను మంచిగ చదువుకుంటూంటే పనిజెప్పవట్టివి.. నువ్వు జేసు కుంటేంది"

"నేనేమన్న వట్టిగున్ననా బిడ్డ.. ఇదువర దాకా పనికిపోయెచ్చిన్నా... ఇప్పుడు వంటపనిజెయ్యద్దా...? మరి రేపటికి కైకిల్లేసి రాకుంటే ఎవ్వలొత్తరు చెప్పు పనికి.. మీ నాయనను పొమ్మంటే నేమో పోకపాయె..."

"ఇప్పుడే వచ్చట్ల కూసుంటే నన్నువట్టుక తినవట్టివి.. ఆడోల్లకు కైకిల్లేసుటానికి నేను పోవన్నా చెప్పు...! అబ్బ నీయవ్వ మీ ఆడోల్లంత రాక్షసులే లేరే!" అన్నాడు నర్సయ్య.

"మేమేమో రాక్షసులం మీరేమో దేవతలు పటు.. పని జెప్పుతే కోపమాయె.. మరిపొల్ల గాని కన్న చెప్పుతానంటే నడుమ పుల్లెయ్యవట్టివి..."

"మీరెందుకు కొట్లాడుకుంటరు కని నేనేం జెయ్యాల్నో చెప్పే అవ్వ...?" పుస్తకాలు అరుగుమీద పెట్టి తల్లి దగ్గరకికొచ్చి నిల్చున్నాడు రాజయ్య....

చిల్లర డబ్బులు తెచ్చి రాజయ్యకిచ్చింది వీరమ్మ... "ఇవి పదిహేను రూపాయలు.. వీట్ని వెంకమ్మ, రాగమ్మ, ఎల్లమ్మ. లింగమ్మ... ఇంకా తెనుగోల్ల వాడకందరికీ కైకిలేసిరా... రేపు మన పొలం కలుపుంది కదా.. ఇవన్నీ కైకిలేసిరా.. ఒక్కొక్కలకు రెండురోజుల కైకిలెయ్యి..." అంది.

"ఎవ్వలకెంత కైకిలెయ్యాన్నే అవ్వ...!"

"పొద్దుగాల అంటే తెల్లారంగనే పోయి బువ్వదినే యాల్లదాక వత్తె బేడ.. బువ్వతిన్నంకనుంచి సాయంత్రం దాకయితే పావలా కైకిలెయ్యి. ఎవ్వలకెంతిచ్చినావో యాది కుంచుకో... వాళ్ళందరికి చెప్పిన.. కైకిలేసుడే మిగిలింది..."

తల్లి చెప్పినట్టు తలూపాడు రాజయ్య.

"కానీ... అవ్వా....! ఓ అవ్వా...!"

అడగడానికి సంశయిస్తున్నాడు రాజయ్య.

"ఏంది బిడ్డా..! ఏందో చెప్పు..!"

"పొద్దంత చేస్తే పావుల కైకిలంటేమన్నట్టే...? గీ కైకిలి సరి పోతదా? పావుల కేమత్తయి చెప్పు...!"

"ఏమెందుకు రావు బిడ్డ..? పావులకు తవ్వెడు వడ్లత్తయి.. ఇంకేం గావాలె చెప్పు...!"

"తవ్వెడు వడ్లు కుంటుంబమంతా తినటానికి సరిపోతదా?" కొడుకు మాటలకు ముక్కు మీదేలుసుకుంది వీరమ్మ... "ఒక్కలు సంపాయిస్తే అందరుతింటరా బిడ్డ...!తినరు గద...! కూలినాలిండ్లల్ల అందరు పనిజేత్తరు...! సంపాయిస్తరు.. పనిజెయ్యకుంటే కడుపు లెట్ల నిండుతయనుకుంటున్నవూ?"

తల్లి మాటలతో సంతృప్తి పడలేదు రాజయ్య.. తాను చాలాసార్లు విన్నమాటనే తల్లితో అన్నాడు. "చాలామంది కైకిలి గిడత లేదంటున్నారు గాదే అవ్వ..." "వేలెడంత లేవు... నీకు గివ్వెన్నెందుకు బిడ్డ...? వాళ్ళకు కైకిలి గిడుతుందో లేదోకాని మనసొంటి చిన్న చిన్న వ్యవసాయాలునోళ్ళకు ఎపసంల కైకిలి గిడుతుందా చెప్పు? మనం ఇంటోల్లమంతా రాత్రింబవల్లు పనిజేత్తం గదా మరి.. అందరికీ రోజు కూలిగట్టు... పండిన పంటకు ధరగట్టు... మనకే పాటి కైకిలి పడుతందో తెలుత్తది..."

తల్లితో ఇంకేం వాదించదలచుకోలేదు రాజయ్య.." సరినే అవ్వ... కైకిల్లేసత్త.." అని తల్లి చెప్పిన ఇండ్లదిక్కు నడిచాడు రాజయ్య...

'పొద్దంతా కలుపుతీస్తే కైకిలి పావలా... ప్రొద్దున్నయితే రెండణాలు..." జేబులో ఉన్న డబ్బును చేత్తో తాకుతూ అనుకుంటున్నాడు రాజయ్య.

తల్లి చెప్పిన ఇండ్లకు వెళ్ళి కైకిల్లు వేస్తున్నాడు. 'మా అవ్వ.. వాగుల పొలంలకు కలువ రమ్మన్నది..." అని రెండు రోజుల కైకిలిగా రెండు పూటలు వస్తానంటే ముప్పావలా, ఒక్కపూటే వస్తానంటే అర్థరూపాయిస్తున్నాడు.

"ఉషారే ఉన్నవు పిలగా.. సరిగ్గానే లెక్క బెట్టి పైసలిస్తున్నవు..." పరాచికాలాడుతున్నారు కొందరాడవాళ్ళు".

"నేను లెక్కల్ల ఫస్టు తెలుసా?" అని కైకిలి డబ్బులిస్తున్నాడు.

"కైకిలేసుటానికి నువ్వచ్చినవా పిలగ..." అని వదిన వరుసలున్నవాళ్ళు అంటున్నారు.

"నువ్వచ్చినవా తమ్మి.. మీ అవ్వేంజేత్తంది..!" అక్క వరసలున్నవాళ్లంటున్నారు...

"అయ్యో చదువుకున్న పిల్లానివి. నీకు గీ కయికిల్లసంగేతేం తెలుసని తోలింది, మీ అవ్వ. మీ అవ్వేం జేత్తున్నదింట్ల... నువ్వు జెప్పుతే ఎవ్వలొస్తరు...?" అత్త వరుసలున్న వాళ్ళు హాస్యంగా మాట్లాడుతున్నారు...

"రాకుంటేం జేత్తరు...? నేనిస్తె అవి పైసలు గావా...? మా అవ్వకు ఇంట్ల బాగపనుంది.. అందుకే నన్ను తోలింది..."

కైకిలి విషయంలో రాజయ్యను సందేహము లాగే పీడిస్తూనే ఉంది. ఎవరినైనా అడిగి తెలుసుకోవాలనుకున్నాడు. చెప్పిన వాళ్ళందరికీ

కైకిల్లు వేస్తూనే ఉన్నాడు. లింగమ్మ దగ్గరికెళ్ళాడు...

"లింగమ్మత్తా.. లింగమత్తా.." కైకిలివేస్తూ పిలిచాడు.. "ఏంది పిలగా ఏం...?"

"పొద్దంతా పనిజేస్తే పావలా కైకిలి గిడతదా మీకు..."

అతన్ని పీడిస్తున్న అనుమానమేంటో అర్థమైనా ఆ పసివానికి సమాధానమెలా చెప్పాలో ఆమె కర్థం కాలేదు.

"మీకు పనులు లేనప్పుడు మీ అవ్వగూడ కైకిలి పోతదిగద...! ఆమెనే అడుగకపోయినవా...?" అంది లింగమ్మ...

"మా అవ్వ నడిగిన... సరిగ్గా చెప్పలేదు.."

"ఊళ్ళున్న రేటే ఇది. అందరికంతే మరి... ఏడాదంతా పాలేరుంటే బట్ట పొట్టకు పోంగ రెండువందల రూపాయలిస్తరు. కైకిలి గిట్టినా గిట్టకున్నా అంతేమరి..."

"ఎప్పుడు గిదే కూలుంటదా మరి..."

"కలుపులు, నాట్లు వేయడంలాంటి పనులకు కూలీగా డబ్బులిస్తారు కదా...! ఇదే కూలి. కానీ పెరండ్లు కోసుడు, వరికోతలు, పెసరుకాయవేరడం, పల్లికాయ తెంపడం లాంటి పనులుంటయిగా...! దినుసు ఇంటికొచ్చేపనులు...గా పనులకు అదే ధాన్యం కూలి కిందిస్తరు... అప్పుడెక్కువ కూలి పడుతది.. మంచి కైకిలి గిడుతది..."

ఇపుడు కొంత అర్థమైనట్టయింది రాజయ్యకు... కైకిలితో బతుకుతున్న జీవితాల గూర్చి ఆలోచిస్తూనే తల్లి చెప్పిన వాళ్ళందరికీ కైకిల్లు వేశాడురాజయ్య. వాళ్ళందరికే కైకిలి గిట్టుబాటు కావడం లేదన్నదే అతని బాధ...

"నీకేంది పిలగా.. మంచిగ సదువుకుంటున్నవు. నౌకరీ దొరుకుతె మంచిగ బతుకుతవు.." అన్నవాళ్ళు ఉన్నారు. అందరికీకైకిలు వేసి ఇంటికొచ్చాడు రాజయ్య. ఏవిధంగా ఆలోచించినా ఆ కైకిలి తక్కువే అనిపిస్తుందతనికి...

కూలికోసం గుడ్డకోసం పట్టణంలో బతుకుదామని బయలుదేరిన బాటసారికిఎంత కష్టం...? ఎంత కష్టం...? తెలుగు మాస్టారు చెప్పిన శ్రీశ్రీ మాటలను జ్ఞాపకం చేసుకున్నాడు.. "అవ్వా.. అవ్వా... ఆ కైకిలి చాలా తక్కువనిపిస్తుందే.. ఇంకొంచెమెక్కువియ్యాలే... అంత తక్కువ కైకిలితో ఎట్ల బతుకుతరే...!"

తల్లితో అనకుండా ఉండలేకపోయాడు.

"కైకిలి ఎక్కువిచ్చుడు, తక్కువిచ్చుడు మన చేతులుందా బిడ్డ..! ఊళ్ళున్న రేటుగది. నేను కైకిలికి పోయినా గంతే వత్తయిగద...!" అంది వీరమ్మ.

"అంతేనాయె అవ్వా..."

"అంతేబిడ్డ. అందుకే నువ్వు మంచిగ సదువుకొని నౌకరి జేత్తే మంచిగుంటది.. గీ కైకిలి బతుకులు పోతయి. బాగా చదువుకొని మంచి నౌకరి దొరికిపిచ్చుకోబిడ్డ..."

"అవునే అవ్వ.. నేను బాగసదువుకుంటా.. పెద్ద నౌకరి జేత్త.... నా దగ్గర పనిజేసెటోల్లకెక్కువ కైకిలిత్త..."

"సరెతియ్యి బిడ్డ. అప్పటికే రాజు ఏ పట్న మేలుతాడో..." ఆ సంఘటన రాజయ్యపై గాఢమైన ముద్రనే వేసింది. కైకిలి, కైకిలి, కైకిలి.. చాలీ చాలని కైకిలి.. ఈ కైకిలి కోసమే..తవ్వెడువడ్ల గింజల కోసమే ఎంతో మంది రోజంతా పనిజేస్తున్నరు. బాకీ బతుకులు బతుకుతున్నరు.....

అలా ఆలోచిస్తూనే పెద్దవాడయ్యాడు రాజయ్య.... బాగానే చదువుకున్నాడు... మంచి ఉద్యోగమే సంపాదించుకున్నాడు.. ఉద్యోగ ధర్మాన్ని బాగానే నిర్వర్తించాడు. అంకితభావంతోనే పనిచేశాడు. పనిన్ప్రేమించి మరీ పనిచేశాడు. డ్యూటీకే అంకితమయ్యేపని చేశాడు.

అయినా అతను పని చేస్తున్న ప్రభుత్వ సంస్థ నష్టాల్లో నడుస్తుందని వేతన స్తంభన చేశారు. ఖర్చులు పెరిగిన సమయంలో వేతన స్తంభన చేయడం వల్ల వస్తున్న జీతం దేనికీ సరిపోవడంలేదు. ఇతర ఉద్యోగుల జీతాలలో తన జీతాన్ని పోల్చుకుంటే సగం కూడా ఉండడం లేదు. పదేళ్ళుగా వేతన సవరణ లేకపోవడం వల్ల ఎంతో జూనియర్లు అతనికంటే ఎక్కువే గడిస్తున్నారు. క్రమక్రమంగా రాజయ్య కొనుగోలు శక్తి క్షీణిస్తున్నది. అవసరాలేమో పెరుగుతున్నాయి. పిల్లల చదువులకయ్యే ఖర్చులు భరించలాకుండా ఉన్నాయి..



అపుడు చనిపోయిన తల్లి జ్ఞాపకం వచ్చింది. తండ్రీ జ్ఞాపకం వచ్చాడు.

"అమ్మా..! నా చిన్నతనంలో కూలీవాళ్ళకు కైకిలి గిట్టడం లేదని బాధపడ్డాను. కాని ఇప్పుడు నాకే కైకిలి గిట్టడంలేదు. ఏం చేయాలమ్మా.."

తనలో తానే గొణుక్కుంటున్నాడు.

"అడిగిన జీతంబివ్వని మిడిమేలపుదొరను కొలిచి మిడుకుటకంటేన్ వడిగల రెండెడ్ల గట్టున మడిదున్నకబతుకవచ్చు మహిలో సుమతీ.." అని నాన్న చదివిన పద్యాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నాడు...

"నౌకరంటేముందిమరి..? పెద్ద జీతగాడన్నట్టు.. కొంత మంచి కైకిలనట్టు...గంతే కదా.. ససంత్ర బతుకేం పాడయిదంట్ల..."

తనకు కొత్తగా నౌకరి దొరికిన సమయంలో తండ్రన్న మాటలను జ్ఞాపకం చేసుకున్నాడు.

'నాన్న! కైకిలే గిట్టడం లేదంటే ఇప్పుడా నామమాత్రపు కైకిలి కూడా బందుకాబోతుంది. ఎటూ కాని వయసులో ఏం నౌకరి దొరుకుతుంది నాన్నా! మడి దున్నిక బతుకుదామంటే మల్లూ లేవు.. మాన్యాలూ లేవు...

తనలో తాను గొణుక్కుంటున్నాడు రాజయ్య...

★ ★ ★

రాజయ్య కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. లుంగీతో కళ్ళు తుడుచుకున్నాడు.

"ఏం రాజయ్యా..! ఏం చేస్తున్నావు... ఫ్యాక్టరీ మూతగూర్చె ఆలోచిస్తున్నావా...?" అంటూ లోపలికొచ్చిన మిత్రుని మాటలతో ఈ లోకంలో కొచ్చాడు.

"ఆల.. ఆల...అదేంకాదు రమేష్" తడబడుతూ అన్నాడు.

"నువ్వేంటి ఇప్పుడెవరైనా అదే ఆలోచిస్తారు.. మన ఫ్యాక్టరీ ఉద్యోగులందరి గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయిప్పుడు. ఒక్క మన ఫ్యాక్టరేం కర్మ...? ప్రభుత్వ సంస్థల ఉద్యోగులందర్నీ బతుకు భయం పట్టుకుంది..." అన్నాడు కుర్చీలో కూర్చుంటూ రమేష్...

"అవును.. కాని రమేష్.. మనమే తప్పు చేశామని ఇంత శిక్షఅనుభవించాలి? అసలీ పరిస్థితికి తప్పెవరిది?"

"తప్పెవడిదంటే ఏం చెప్పడం రాజయ్య? అప్పిచ్చువాడు వైద్యుడన్నారుకదా...! అప్పిచ్చువాడు చెప్పినట్టు చేయాలి..."

"అందుకోసం మనం బలికావాలి. అంతే కదా...! ఒకప్పుడు ఫ్యూడల్ వ్యవస్థ గ్రామాల్లో ఉన్నపుడు కూడా కూలిరేట్లు చాలవని పెంచడానికి పోరాటాలు చేసేవారు. కొన్నేండ్ల కొకసారైనా పెంచేవారు. మరిప్పుడు. పదేళ్ళయినా జీతాలు పెంచడం లేదంటే ఇదే విధానమన్నట్టు? పాలేరుంచుకున్న వాళ్ళు కూడా వ్యవసాయంలో లాబాలొచ్చినా. నష్టాలొచ్చినా ఒప్పందం ప్రకారం ఆ సమయం అయ్యే వరకుంచునేవారు. జీతమిచ్చేవారు.. మరి మన ప్రజాస్వామ్య యుగంలో పదేళ్ళు, ఇరవై ఏళ్ళు ముందుగా రిటయిరయి పొమ్మంటే ఏంటన్నట్టు.? కనీసం అప్పటి ఫ్యూడల్ విలువల్ని కూడాపాటించడం లేదన్నట్టే కదా...!"

"మనమేమన్నా అంతా అరణ్య రోదనే... ఎవరూ పట్టించుకునే వాళ్ళు లేరు..."

వాళ్ళు కష్టసుఖాలు చాలా సేపేమాట్లాడుకున్నారు.

రమేష్ వెళ్ళిపోయాడు.

ఇంట్లో రాజయ్యొక్కడే మిగిలాడు.

కైకిలి గురించిన ఆలోచనలతన్ని వదలడం లేదు. 'అమ్మా...! కూలీవాళ్ళకు కైకిలి గిడుత లేదని అప్పుడు బాధపడ్డాను. నీతో చెప్పుకున్నాను. మరినా చాలీచాలని కైకిలి గురించి ఎవరికి చెప్పుకోను...? ఇదీ తీసేస్తానంటున్న దుర్మార్గాన్నేమనాలమ్మా....?"

నిస్సహాయంగా గొణుక్కుంటూనే ఉన్నాడు రాజయ్య...